

సమ్మక్క రాక కోసం చిలుకల గుట్ట వద్ద ఎదురుచూస్తున్న రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ

# అంతర్జాతీయ స్థాయిలో గిరిజన యూనివర్సిటీ

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు
- రూ. 900కోట్లతో సమ్మక్క-సారక్క కేంద్రియ గిరిజన యూనివర్సిటీ
- మేడారంలో సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సమ్మక్క గద్దె వద్ద మొక్కుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా గిరిజన యూనివర్సిటీని ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన విశ్వ విద్యాలయం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. గురువారం ఆయన మేడారం మహాజాతరకు హాజరై సమ్మక్క-సారలమ్మ దర్శించుకున్నారు. వన దేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ములుగులో గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గట్టమ్మ దేవాలయం ఎదుట 337ఎకరాల ప్రభుత్వ భూమిని సమకూర్చగా, యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్లను విడుదల చేసిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులను ప్రారంభిస్తామని, జాకారం యూత్ వైటీసీలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన యూనివర్సిటీకి సలహాదారుడిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. పాడి పంటలతో దేశమంతా సుభిక్షంగా ఉండాలని సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. కిషన్‌రెడ్డి వెంట రాష్ట్ర మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, తదితరులు ఉన్నారు.

# అడిషనల్ డైరెక్టర్‌కు అనారోగ్యం

## వైద్యశాలలో చికిత్స



ఇంజక్షన్ తీసుకుంటున్న సర్వేశ్వర్ రెడ్డి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : జాతరలో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన గిరిజన సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి గురువారం అనారోగ్యానికి గురయ్యారు. గద్దెల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాలలో చికిత్స పొందారు. డీఎంహెచ్‌వో అప్పయ్య వైద్య సేవలను పర్యవేక్షించగా, సిబ్బంది ఇంజక్షన్ చేసి మందులు అందజేశారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ వైద్యశాలను సందర్శించారు. ప్రస్తుతం జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, రోజు వారీ ఓపీ, ఐపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏటీడీవో దేశీరాంనాయక్ తదితరులున్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కర్ణన్

## వైద్యశాలను తనిఖీ చేసిన ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : మేడారం జాతరలో ఏర్పాటు చేసిన అత్యవసర చికిత్స విభాగం, మెడికల్ క్యాంపును ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ కర్ణన్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఎమర్జెన్సీ రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అందించిన అత్యవసర చికిత్స వివరాలను డీఎంహెచ్‌వో అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు.

## ఆదిదేవతకు మొదటి మొక్కులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 22: ఆది దేవత గట్టమ్మకు మేడారం వెళ్లే భక్తులు మొదటి మొక్కులు చెల్లిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వేళల్లో భక్తుల తాకిడి విపరీతంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పసుపు, కుంకుమ వేసి మొక్కులు చెల్లించారు. పోలీస్, రెవెన్యూ శాఖ, దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.



గట్టమ్మ వద్ద భక్తుల కోలాహలం

# జాతరకు తరలివచ్చిన భక్తులు

### దర్శించుకున్న తాజా, మాజీ ఎమ్మెల్యేలు

రేగొండ, ఫిబ్రవరి 22 : మండలంలోని తిరుమలగిరి శివారు పాండవుల గుట్టల సమీపంలో నిర్వహిస్తున్న మినీ మేడారం జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గురువారం జెండా గుట్ట వద్ద పూజారులు సూరిటి రాజు, కాగ లింగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమ్మక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించడంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జాతరను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంకం రాజేందర్, కాంగ్రెస్ నాయకులు నిమ్మల విజేందర్, వెంకటస్వామి, రమణారెడ్డి తదితరులున్నారు.



చిట్యాల : పూరేడు గుట్టలో మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



రేగొండ : అమ్మవార్లను దర్శించుకుంటున్న సత్యనారాయణరావు

### మాజీ ఎమ్మెల్యే పూజలు

చిట్యాల/మొగుళ్లపల్లి : చిట్యాల మండలంలోని వెంచరామి శివారు పూరేడు గుట్ట, మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ములుకలపల్లి మినీ మేడారం జాతరలను గురువారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. అమ్మవార్లను దర్శించుకుని సమ్మక్క, సారమ్మల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరల విషయంలో అధికార పార్టీ నాయకులు రాజకీయం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వెంట టేకుమట్ల ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి, జోరుక సదయ్య, కూర సురేందర్‌రెడ్డి, నాయకులు కచ్చు మల్లేశ్, అంజిరెడ్డి, పాండ్రాల స్వామి, కొత్తూరి రాజిరెడ్డి, నరేశ్, చదువు అన్నారెడ్డి, కొడారి రమేశ్, బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, దానవేన రాములు, ముడుపు రవి, చెక్క శ్రీధర్, గడ్డం రాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జంపన్నవాగులో నీట మునిగి ఒకరు మృతి

### బాలుడు గల్లంతు

ఏటూరునాగారం/ ఫిబ్రవరి 22 : జంపన్నవాగులో గురువారం పుణ్యస్నానం ఆచరిస్తూ నీట మునిగి ఓ వ్యక్తి మృతిచెందగా, మరో బాలుడు గల్లంతయ్యాడు. కామారెడ్డికి చెందిన కుర్మ సాయిలు (45) స్నేహితులతో కలిసి గురువారం మేడారం వచ్చాడు. స్నానం చేస్తుండగా నీటిలో మునిగి గల్లంతయ్యాడు. కొద్ది సేపటి తరువాత తేలడంతో వైద్యశాలకు తరలించారు. సాయిలును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. కాగా, బాలుడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితంలేకుండా పోయింది.

## క్రమశిక్షణతో కృషి చేస్తే విజయం సొంతం



పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జీఎం బల్లారి శ్రీనివాస రావు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 22 : ప్రతి ఒక్కరూ నిజాయితీ, క్రమశిక్షణతో కృషి చేస్తే విజయం సొంతమవుతుందని భూపాలపల్లి సింగరేణి జీఎం బల్లారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాబర్డ్ బెడెన్ పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం సింగరేణి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమనేది అదృష్టంగా భావించాలని, కేవలం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి మాత్రమే రాష్ట్రపతి నుంచి అవార్డు తీసుకునే అవకాశం దక్కుతుందన్నారు. స్కౌట్స్ విద్యార్థులకు సింగరేణి సంస్థ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. అనంతరం పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా అధికారి ప్రతినిధి అజ్మీరా తుకారాం, డీవైపీఎం శ్యామ్ ప్రసాద్, స్కౌట్స్ ఇన్‌చార్జి సంజీవరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.



ఎదుర్కోలుకు వెళ్లేముందు ఇలవేల్పులకు పూజలు చేస్తున్న గిరిజన పెద్దలు

## గిరిజన ఇలవేల్పులకు సంప్రదాయ పూజలు

మంగపేట ఫిబ్రవరి22:రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి మేడారం తరలివచ్చిన ఆదివాసీ గిరిజనుల ఇలవేల్పులు(కులదైవాలు)కు గురువారం గిరిజన కులపెద్దలు గిరిజన సంస్కృతీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. వేల్పులను ప్రతిష్ఠించిన అనంతరం తమ ఆచారం చొప్పున ముగ్గులు వేసి, గుగ్గిలంతో ధూపాలు వేసి ఉదయం నుంచి గిరిజన సంప్రదాయ పూజలు చేశారు. సాయంత్రం చిలుకలగుట్ట నుంచి గద్దెకు బైలెల్లిన సమ్మక్కను ఎదుర్కొనేందుకు డోలు వాయిద్యాలు, నృత్యాల నడుమ తమ కులదైవాలతో తరలి వెళ్లనున్నట్లు ఆయా ప్రాంతాల చెందిన గిరిజన కుల పెద్దలు ఈందర్భంగా తెలిపారు.

### దర్శించుకున్న ఎమ్మెల్సీ



ములుగు రూరల్, ఫిబ్రవరి 22 : మేడారం వనదేవతల ను మాజీ స్పీకర్, ఎమ్మె ల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం దర్శించుకున్నారు. సమ్మక్క తల్లి గద్దెకు వచ్చిన అనంతరం ఆయన సమ్మక్క-సారలమ్మలకు బెల్లం సమర్పించేందుకు నెత్తిన బెల్లం బుట్టతో గద్దెలకు చేరుకున్నారు.

## మీడియాకు ఆంక్షలు

ములుగు, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : చిలుకలగట్ట వద్ద తొలిసారి మీడియా ప్రతినిధులకు ఆంక్షలు విధించారు. మహాజాతరలో సమ్మక్కను తీసుకొచ్చే సమయంలో ప్రధాన ఘట్టం దృశ్యాలను సేకరించేందుకు అక్కడికి వచ్చిన మీడియా ఫొటోగ్రాఫర్లను, కెమెరామెన్లను చిలుకలగట్టు లోపలికి వెళ్లే గేట్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు, మీడియా ప్రతినిధులకు వాగ్వాదం జరిగింది. పోలీసుల చర్యలను మీడియా ప్రతినిధులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లగా పోలీసు అధికారులతో మాట్లాడి చిలుకలగట్టు వరకు పంపారు. తర్వాత మళ్లీ అడ్డుకొని ఇద్దరిని మాత్రం పంపించారు. దీంతో మీడియా ప్రతినిధులు పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. సమ్మక్కను గద్దె వద్దకు తీసుకొచ్చే సమయంలో కూడా రోప్‌పార్టీ పోలీసులు కవరేజ్‌కి ఆటంకం కలిగించారు.

## వనదేవతలను ప్రతిష్ఠించిన భైంసా భక్తులు



తల్లులకు పూజలు చేస్తున్న భైంసాకు చెందిన భక్తులు

మంగపేట, ఫిబ్రవరి 22 : తమ మొక్కుబడి ప్రకారం ఆదిలాబాద్ జిల్లా భైంసాకు చెందిన భక్తులు రెడ్డిగూడెం వద్ద సమ్మక్క, సారలమ్మ, జంపన్న, పగిడిద్దరాజు, గోవిందరాజును ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తల్లుల వద్ద పాయసం వండి నైవేద్యంగా పెట్టారు. అనంతరం గుగ్గిలంతో ధూపాలు వేసి పూజించారు.

## ఆర్ అండ్ ఆర్ అవార్డు జాబితా విడుదల

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని గడ్డిగానిపల్లిలో సింగరేణి సంస్థ భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైనందున ముసాయిదా ఆర్ అండ్ ఆర్ అవార్డు జాబితాను విడుదల చేసినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు గడ్డిగానిపల్లి పాఠశాలలో ప్రజల పరిశీలనార్థం జాబితాను ప్రదర్శిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏవైనా అభ్యంతరాలు, సవరణలుంటే ఆధారాలతో సహా ఆర్ అండ్ ఆర్ పరిపాలన అధికారికి 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువు దాటిన అనతరం వచ్చిన దరఖాస్తులను పరిగణలోనికి తీసుకోమని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



దర్శనం అనంతరం గర్భ గుడి ముందు సీపీ అంబర్ కిషోర్‌ఝా

## మల్లూరులో వరంగల్ సీపీ పూజలు

మంగపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవదర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ సిబ్బంది పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భాలయంలో కమిషనర్ పేర ప్రత్యేక అర్చనలు చేసి, స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఏటూరునాగారం సీఐ రాజు, స్థానిక ఎస్సై రవికుమార్, ఆలయ చైర్మన్ నూతిలకంటి ముకుందం, అర్చకులు కైంకర్యం రాఘవాచార్యులు, రాజశేఖర్‌శర్మ, ఈశ్వర్‌చందు శర్మ, పవన్‌కుమార్ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లుల సన్నిధిలో మాజీ కలెక్టర్



తులభారంలో ప్రభాకర్ రెడ్డి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : మాజీ కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి దంపతులు గురువారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణంలో ప్రభాకర్‌రెడ్డి కీలక పాత్ర వహించారు. అతి తక్కువ రోజుల్లో నిర్మాణం పూర్తిచేసి సంచలనం సృష్టించారు. అప్పటి నుంచి ప్రభాకర్‌రెడ్డికి మేడారంతో మంచి అనుబంధం ఉంది. ఇందులో భాగంగానే జాతరకు వచ్చిన ప్రభాకర్‌రెడ్డి దంపతులు తమ ఎత్తు బంగారాన్ని అమ్మవార్లకు మొక్కుల కింద సమర్పించారు.

## దంపతులపై ఖాకీ జులుం

ములుగు, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : సమ్మక్క-సారలమ్మ సాక్షిగా ఓ పోలీస్ ఉన్నతాధికారి జాతరలో దంపతులపై చేయిచేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. తల్లుల దర్శనానికి శ్రీనివాస్ అనే భక్తుడు కుటుంబంతో సహా కారులో వచ్చాడు. పార్కింగ్ విషయంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్‌తో శ్రీనివాస్‌కు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సహనం కోల్పోయిన ఏసీపీ అతడిపై చేయిచేసుకున్నాడు. ఇదేమిటని ప్రశ్నించిన శ్రీనివాస్ భార్య పద్మినిపై సైతం చేయిచేసుకున్నాడు. దీంతో దంపతులిద్దరూ కారును అక్కడే వదిలేసి ఆందోళనకు దిగారు. ట్రాఫిక్ జామ్ కావడంతో ఇతర ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని ఏసీపీని మందలించారు. ఏసీపీ కిశోర్ కుమార్ మాత్రం తాను పద్మినిపై చేయి చేసుకోలేదని, అనుకోకుండా తన చేయి ఆమెకు తాకిందని బదులిచ్చారు.

## చల్వాయి శివారులో కారు బోల్తా

గోవిందరావుపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని చల్వాయి గ్రామ శివారు వైన్‌షాపు సమీపంలో గురువారం కారు బోల్తా పడింది. ఖమ్మం పట్టణానికి చెందిన ఐదుగురు యువకులు కారులో అతి వేగంతో వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఒక్క సారిగా వైన్స్ షాపు సమీపంలోని జాతీయ రహదారి పక్కనే పల్టీలు కొట్టడంతో అందులో ఉన్న ఐదుగురు ఎలాంటి ప్రమాదానికి గురి కాకుండా ప్రాణాలతో బయటపడ్డారు.

## మేడారం జాతర ట్రస్ట్ బోర్డులో గిరిజనేతర డైరెక్టర్లను తొలగించాలి

వాజేడు, ఫిబ్రవరి 22 : మేడారం జాతర ట్రస్ట్ బోర్డులో గిరిజనేతర డైరెక్టర్లను తొలగించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పునెం సాయి డిమాండ్ చేశాడు. మండలకేంద్రంలో గురువారం జీఎస్పీ కార్యకర్తల అత్యవసర సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన సాయి మాట్లాడుతూ ఆదివాసీల ఇలవేల్పు సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర ట్రస్ట్‌బోర్డులో గిరిజనేతర డైరెక్టర్లను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పునెం ప్రతాప్, గొంది మోహన్ ప్రసాద్, పార్థు పాల్గొన్నారు.

## మేడారంలో గుండెపోటుతో భక్తుడు మృతి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామానికి చెందిన చింతల కొమురయ్య(68) తన కుటుంబ సభ్యులతో కలిసి మేడారం వచ్చాడు. వీరంతా జంపన్న వాగు అవతలి వైపున విడిది చేశారు. కాగా, గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే వైద్యశాలకు తరలించారు. అయితే కొమురయ్య మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జాతరలో సంతోషంగా గడుపుదామని వచ్చిన ఆ కుటుంబం ఇలా అనుకోని దుర్ఘటనతో విషాదం మునిగిపోయింది.

## గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం తేవాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 22 : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సూచనలను అమలు చేయాలని, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై దాడులను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. పోలీసుల కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకుల సన్మానం

టేకుమట్ల, ఫిబ్రవరి 22 : టేకుమట్ల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మిని బుధవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ కూర సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవి, ఎంపీటీసీ పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, బందెల నరేశ్, మారం లింగారెడ్డి, నానవేన కుమార్, మేకల రాజు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచితంగా మినరల్ వాటర్



మినరల్ వాటర్‌ను అందిస్తున్న దాత

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : మేడారం జాతరకు వస్తున్న భక్తుల దప్పికను తీర్చేందుకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారు. బస్టాండ్‌కు వెళ్లే దారిలో గంగిశెట్టి సత్యనారాయణ సిమెంట్ మర్చంట్ సౌజన్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సేవను వినియోగించుకుంటున్నారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో వివిధ సేవలు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జే చిన్న తెలిపారు. వారికి తోడుగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గన్‌సింగ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ వలంటీర్లు భక్తులు రద్దీగా ఉన్న ప్రాంతం, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో పనిచేస్తున్నారని చెప్పారు. అనారోగ్యానికి గురైన వారికి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, the undersigned **SIDDAMSHETTY VASANTHA KUMARI** (New Name), previously called **SIDDAMSHETTY VASANTA KUMARI** (Old Name), and residing at # H.No. 16-5-137/2, PERUKAWADA, RAILWAY GATE, WARANGAL - 506002.
NTW-00

★**I, JANGA SREEMATHI W/o. AVULA RAJAIAH** R/o. H.No. 2-10-399, Teachers Cly, Ph-2, Waddepally, Hanamkonda, Warangal TS-506370 changed name as AVULA SRIMATHI.
NT-311621

**PLOT FOR SALE**



★ఈ రోజే ఇల్లు కట్టుకోవచ్చు-కాటేజ్/గెస్ట్‌హౌజ్/కొరకు 1 గజం రూ|| 3000/- మాత్రమే. నేషనల్ హైవే (వరంగల్) కు 2 కి.మీ., యాదగిరి గుట్టకు 4 కి.మీ., ఇండ్ల మధ్యలో - లిమిటెడ్ ప్లాట్లు A. ప్రవళిక **9581478475**
NTW-323017

★**హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ,** బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
| --- | --- |
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565